
మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్

బాధ్యతగా మొక్కలు నాటాలి

- మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్

ఆమనగల్లు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పచ్చని ఆమనగల్లు పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. వన మహోత్సవ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఆమనగల్లు మున్సిపాలిటీ వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది, ఉద్యోగులతో కలిసి కమిషనర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రోడ్డు వెంబడి మొక్కలు నాటించారు. మూడు రోజుల్లో మున్సిపాలిటీ పరిధిలో 3500 మొక్కలు నాటినట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో ఈ ఏడాది 50వేల మొక్కలు నాటాలనే లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. మొక్కల పెంపకం లక్ష్యాల పూర్తికి మున్సిపాలిటీ చేస్తున్న కృషిలో ప్రజలందరూ పాలుపంచుకోవాలని కోరారు. మొక్కలు నాటే ప్రదేశాలను ఇప్పటికే గుర్తించి నర్సరీల నుంచి మొక్కలు డంపు చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో చాలా పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఇందులో ఆయా పోస్టులు అధికంగా ఖాళీగా ఉన్నాయి. నాలుగేళ్లుగా వాటిని భర్తీ చేయకపోవడంతో ఉన్నవారిపై పనిభారం పడుతోంది. ఆరోగ్య, ఇతర సర్వేల బాధ్యతలను టీచర్లకు అప్పగిస్తుండటంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం సత్వరమే స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరముంది.



- టీచర్లు 25, ఆయాలు 106
- కేంద్రాల్లో అందని పౌష్టికాహారం
- ఖాళీ ఉన్నచోట ఇన్‌చార్జిలే దిక్కు
- పనిభారంతో అంగన్‌వాడీల అవస్థలు

భర్తీ ఎప్పుడో?



అంగన్‌వాడీల్లో 127 పోస్టులు ఖాళీ

జిల్లాలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల ఖాళీల వివరాలు

అంగన్‌వాడీ కేంద్రాలు	1,600
టీచర్లు మంజూరు	1,600
పనిచేస్తున్న వారు	1,577
ఖాళీలు	25
మంజూరైన ఆయాల పోస్టులు	1,380
పనిచేస్తున్న వారు	1,274
ఖాళీలు	106

రంగారెడ్డి అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అంగన్‌వాడీల పోస్టులు ఎప్పుడు భర్తీ చేస్తారా? అని అర్హులు ఎదురు చూస్తున్నారు. మహిళా, శిశు సంరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో పలు పోస్టులు ఇంకా ఖాళీగా దర్శనమిస్తున్నాయి. జిల్లాలో నాలుగేళ్లుగా ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఆయా కేంద్రాల పరిధిలోని బాలింతలు, గర్భిణులు, పిల్లలకు సక్రమంగా పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల ఇన్‌చార్జిలే నడిపిస్తున్నారు.

టీచర్లు 25, ఆయాలు 106 ఖాళీ..

జిల్లాలో 27 మండలాలు, 5 రెవెన్యూ డివిజన్లలో 7 ఐసీడీఎస్ ప్రాజెక్టుల

మిగతా 8వ పేజీలో...

ఇంటర్ ఉంటేనే అంగన్‌వాడీ పోస్టు

అంగన్‌వాడీ టీచర్‌తో పాటు హెల్పర్లుగా ఉద్యోగాలకు నియమితులయ్యే వారికి కనీసం ఇంటర్ ఉత్తీర్ణత ఉండాలి. గతంలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు కనీసం పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలన్న నిబంధన ఉండేది. కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్, వర్కర్ పోస్టులకు విద్యార్హతను పెంచింది. ఇకపై కనీసం ఇంటర్మీడియట్ అర్హతగా నిర్ణయించింది. వయోపరిమితి 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. అలాగే 65 ఏళ్లు దాటిన తర్వాత వారి సేవలను వినియోగించుకోకూడదు. ఖాళీల్లో 50 శాతం హెల్పర్లకు పదోన్నతులు కల్పించి భర్తీ చేయాల్సి ఉంటుంది.



ప్రభుత్వ ఆదేశాలు రాగానే..

ప్రభుత్వ ఆదేశాలు రాగానే ఖాళీ పోస్టులను భర్తీ చేస్తాం. ఇప్పటికే జిల్లాలో ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయా పోస్టుల ఖాళీలకు సంబంధించి నివేదికను ప్రభుత్వానికి నివేదించడం జరిగింది. త్వరలో ఖాళీలకు మోక్షం కలిగే అవకాశాలున్నాయి.

శ్రీలత, జిల్లా శిశుసంక్షేమాధికారి


మైసమ్మకు పూజలు నిర్వహిస్తున్న మధుయాష్కిగౌడ్

ప్రజల ఆకాంక్షలకనుగుణంగా రాష్ట్రంలో ప్రజాపాలన

- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్

కడ్తాల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రతీ ఒక్కరికి మేలు జరుగుతుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ అన్నారు. సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ ఆలయాన్ని ఆదివారం ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు ట్రస్ట్ శిరోలిపంతు, ఈవో స్నేహలత, అర్చకులు ఆలయ మర్యాదలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వపరంగా తోడ్పాటునందించాలని కోరారు. ఈ సందర్భంగా మధుయాష్కిగౌడ్ మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు పథకాలు అందాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రభుత్వ చేయూతతో పేదలు కష్టాల నుంచి మైదొలిగి ఆనందంగా ఉంటే విపక్షాలు జీర్ణించుకోలేక విష ప్రచారాలకు ఒడిగట్టాయని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం రాష్ట్రంలో విపక్షాలు కనుమరుగు అవుతాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు ప్రజాప్రతినిధులను గెలిపిస్తే గ్రామాలు మరింత అభివృద్ధి సాధిస్తాయన్నారు. రాజధానికి చేరువలో ఉన్న కల్వకుర్తి ప్రాంతం వేగవంతంగా అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ ఆంజనేయస్వామి దేవాలయ డైరెక్టర్ దుర్గారెడ్డి, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు యాదగిరి, సిబ్బంది చంద్రయ్య, శ్రీను, కృష్ణ పాల్గొన్నారు.

రెడ్డి జేఏసీ జిల్లా కార్యదర్శిగా అనురుద్రారెడ్డి



ఆమనగల్లు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రెడ్డి జేఏసీ జిల్లా కార్యదర్శిగా మండలానికి చెందిన లిక్కి అనురుద్రారెడ్డి నియమితులయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి జేఏసీ చైర్మన్ అప్పమ్మగారి రాంరెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. రెడ్డిల సమస్యల పరిష్కారం కోసం చేసిన కృషికి గుర్తింపుగా అనురుద్రారెడ్డికి ఈ అవకాశం లభించింది. తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించి రెడ్డి కులస్థుల సంక్షేమానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడికి, సహకరించిన జిల్లా సభ్యులకు అనురుద్రారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



చలాన్లే టార్గెట్.. ట్రాఫిక్ నియంత్రణేది?

- రోడ్ల ఆక్రమణలతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- నరకం చూస్తున్న వాహనదారులు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

షాద్‌నగర్‌లో అస్తవ్యస్తంగా పార్కింగ్

షాద్‌నగర్‌రూరల్, జూన్29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధానికి, అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరువలో ఉండటంతో పాటు రైల్వేస్టేషన్ కూడా అందుబాటులో ఉండటంతో షాద్‌నగర్ దినదినాభివృద్ధి చెందుతోంది. కానీ పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించడం లేదు. దీనిపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. గతంలో ఎన్నో ప్రయత్నాల తర్వాత షాద్‌నగర్‌కు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ మంజూరైంది. అయినా ఆశించినట్లు ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాలేదు.

ఫొటోలు తీయడంపైనే దృష్టి

ట్రాఫిక్ సమస్యను పట్టించుకోకుండా చలాన్లపైనే పోలీసులు ఎక్కువ దృష్టి పెడుతున్నారనే విమర్శలున్నాయి. నాలుగు రోడ్లలో కెమెరాలు పట్టుకుని

మిగతా 8వ పేజీలో...


వాహనదారుడికి చలాన్ రాస్తున్న పోలీసులు



నిబంధనల ప్రకారం లేకుంటే జరిమానాలు విధిస్తాం

నిబంధనల ప్రకారం సెల్లార్లు నిర్వహించకుంటే జరిమానాలు విధిస్తాం. తమ సిబ్బందిని పంపించి విచారణ చేయిస్తాం. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంటే ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుంటారు.

- సునీత, మున్సిపల్ కమిషనర్, షాద్‌నగర్

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వ తోడ్పాటు

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి


ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి, పురాతన దేవాలయాల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటునందిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. పర్యాటక రంగం అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధిపై ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో స్థానిక నాయకులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. మున్సిపాలిటీలో సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వల నిర్మాణం, ఓపెన్ జిమ్‌ల ప్రారంభం, పార్కుల నిర్మాణం గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న హనుమాన్, మల్లికార్జున స్వామి దేవాలయాలకు పాలకవర్గాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డికి మార్కెట్ డైరెక్టర్ తాల్ల రవీందర్ మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ కేశవులు, కేవీఎన్ ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షులు మెకానిక్ బాబాలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని దేవాలయాలకు ప్రభుత్వం పాలక వర్గాలను ఏర్పాటు చేసి అభివృద్ధికి చర్యలు తీసుకుంటుందన్నారు. రూ.25 కోట్లతో ఆమనగల్లు మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. ఇప్పటికే రూ.10 కోట్లతో చేపట్టే పనులు గుర్తించామన్నారు. మరో రూ.15 కోట్లతో చేపట్టే పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హులందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రభుత్వ కళాశాల భవన నిర్మాణం పనులు కూడ పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్ రెడ్డి, యోగేశ్వర్, సురేందర్ రెడ్డి, విజయ్‌రాథోడ్, తదితరులు ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఇబ్రహీంపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నంలోని శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా శెట్టి శివకుమార్, అధ్యక్షుడిగా మయిని ఆనందప్ప, ప్రధాన కార్యదర్శిగా పట్నంశెట్టి విశ్వనాథ్, ఉపాధ్యక్షులుగా ఎ.తిరుమల్, అనిల్, రమేష్, కోశాధికారిగా ఎం.పవన్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎం.మహేందర్, కార్యదర్శులుగా భద్రప్ప, గిరిధర్, రవి, చంద్రకాంత్, సంతోష్, ముఖ్య సలహాదారులుగా నెల్లి శివకుమార్, ప్రభు, టీఎం చండీశ్వర్, సలహాదారులగా గుండ్ల మహేష్, కర్రె సిద్ధప్ప, బాల్‌రాజ్, నగేష్, యాదప్పలతోపాటు పలువురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.


మాట్లాడుతున్న సబితారెడ్డి

కాంగ్రెస్ కండువా కప్పుకుంటేనే ఇందిరమ్మ ఇల్లు

- రాష్ట్రంలో ప్లానింగ్ లేని అస్తవ్యస్త పాలన
- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ధ్వజం

సరూర్‌నగర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్లానింగ్ లేని పాలన కొనసాగుతోందని, కాంగ్రెస్ కండువా కప్పుకుంటేనే ఇందిరమ్మ ఇల్లు వచ్చే దుస్థితి నెలకొందని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ధ్వజమెత్తారు. ఒక కాలనీని ఎంత ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తామో రాష్ట్రాన్ని సైతం అదే తరహాలో చేయాల్సి ఉంటుందని, కానీ ప్రస్తుతం రాష్ట్రంలో తలాతోక లేని పాలన కొనసాగుతోందని ఆమె ఎద్దేవా చేశారు. ఆదివారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్ 31వ డివిజన్‌లోని గ్రీన్‌రిచ్ కాలనీలో ఎమ్మెల్యే పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం కాలనీవాసులు ఏర్పాటు చేసిన సమావేశంలో సబిత మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డికి ప్రజా సంక్షేమం కన్నా రాజకీయమే ప్రధానంగా మారిందని, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తూ పనులు జరగకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, అధికారులను వేధించడం మంచి పద్ధతి కాదని ఆమె హితవు పలికారు. ప్రజలు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వంతో కొట్లాడైనా నిధులు తీసుకొచ్చి పనులు చేయిస్తానని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ బీఆర్‌ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ సూర్యగంటి అర్జున్, మాజీ కార్పొరేటర్లు పెద్దబావి శోభాఆనంద్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లిక్కి మమతాకృష్ణారెడ్డి, బోయపల్లి దీపికాశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌రాజు, కర్రె బల్వంత్, నరేశ్, సాయి, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రతీ తండాకు శుద్ధమైన తాగునీరు

ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

7

రాజకీయంగా ఎదగడమే లక్ష్యం

సగర సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముత్యాల హరికిషన్

ఇబ్రహీంపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో రాజకీయంగా ఎదగడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సగర సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముత్యాల హరికిషన్, అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలో జరిగిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. జిల్లాల వారీగా సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూనే.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. సగరులు నివాసం ఉన్న ప్రతీ గ్రామంలో భగీరథ మహర్షి విగ్రహం ప్రతిష్ఠించాలని వారు సూచించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మార్క సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శ్రీకాంత్, నాయకులు నాగేశ్వర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముత్యాల హరికిషన్

సమయానికి రాని బస్సులు .. ప్రయాణికుల నిరీక్షణ



ధారూరులో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

ధారూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి) పోతే అటే.. వస్తే ఇటే అన్న చందంగా ఆర్టీసీ బస్సు సర్వీసులు ఉన్నాయని ప్రయాణికుల విమర్శిస్తున్నారు. తాండూరు, వికారాబాద్ డిపోల నుంచి వివిధ రూట్లలో నడుపుతున్న బస్సుల సమయపాలన పాటించక ప్రజలు బస్సు కోసం గంటల కొద్దీ వేచి ఉంటున్నారు. తాండూరు, వికారాబాద్, హైదరాబాద్ ప్రాంతాల వైపు నడుస్తున్న బస్సులు వస్తే ఒకేసారి రెండు, మూడు వెంటవెంటనే వస్తున్నాయని, ఆ తర్వాత గంటల తరబడీ రావడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. గంగల తరబడి బస్టాండ్‌లలోనే వేచి ఉండడంతో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు సకాలంలో గమ్యస్థానాలు చేరలేకపోతున్నారు. బస్సులు ఆలస్యంగా వచ్చే బస్సుల్లో కనీసం నిల్చునేందుకు కూడా జాగ లేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు, మహిళలు ప్రమాదకరంగా ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తున్నారు. ఉచిత ప్రయాణంతో మహిళలు ఎక్కువగా బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. దీంతో బస్సుల్లో సీట్ల సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఎక్కుతున్నారు. ధారూరు బస్టాండ్ నుంచి నిత్యం వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు సాగించే వందలాది మంది సమయానికి బస్సుల రాక, వచ్చిన బస్సుల్లో మితిమీరి ఉన్న ప్యాసింజర్లతో బేజారవుతున్నారు. ఏ బస్సు ఎప్పుడు వస్తుందనే సమచారం బస్‌స్టేషన్‌లో అందుబాటులో లేదు. బస్సుల వివరాలను అడుగుదామన్నా స్టేషన్‌లో ఆర్టీసీ సిబ్బంది లేరని ప్రజలు వాపోతున్నారు. బస్సులు ఎప్పుడు వస్తే అప్పుడే ఎక్కి వెళ్లిపోతున్నామని, వేచి ఉండే బాధ తప్పుతుందని అంటున్నారు. గంటల తరబడి నిల్చోలేక పోతున్నామని వాపోతున్నారు. వికారాబాద్, తాండూర్ డిపోల నుంచి తాండూర్, హైదరాబాద్ రూట్లలో బస్సులను సమయానికి నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.



బస్సులో కిక్కిరిసి ప్రయాణిస్తున్న జనం

కొత్త మైల్‌స్టోన్ పాతించరా?

● ఒకసారి విరిగిన రాయికే మరమ్మతులు

● మరోసారి విరిగిన సూచిక.. ఆర్అండ్‌బీ నిర్లక్ష్యం



విరిగిన కిలో మీటర్ రాయి

షాద్‌నగర్ అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ చౌరస్తా నుంచి సోలీపూర్ వై జంక్షన్ వరకు విస్తరించిన రోడ్డు పనుల్లో భాగంగా సిమెంట్‌తో తయారు చేసిన కిలో మీటరు రాళ్లను పాతారు. రోడ్డు పనులు పూర్తికాగానే పాతిన రాళ్లలో ఉషోదయ షాపింగ్ మాల్ ఎదుట పాతిన రాయిని వాహనం ఢీకొట్టడంతో అది విరిగింది. ఆ రాయిని తొలగించి కొత్త మైల్ స్టోన్‌ను పాతాల్సి ఉండగా విరిగి సిమెంట్ దిమ్మెకే సిమెంట్ పూసి రంగు వేశారు. కొన్నాళ్లకే అదే రాయి మరోసారి విరిగిపోయింది. రాయి విరిగి నెలలు గడుస్తున్నా దాని స్థానంలో కొత్తది పాతడం లేదు. మరమ్మతయినా చేయించడం లేదు. విరిగిన రాయిని ఎలా పాతుతారని కాంట్రాక్టర్‌ను అధికారులు ప్రశ్నించి ఉంటే అప్పుడే కొత్త రాయి పాతేవారేమో. ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకొని కొత్త మైల్‌స్టోన్‌ను పాతించాల్సి ఉంది.

ప్రాణాలతో చెలగాటం

● ఇరుకు రోడ్డుపై రెండు వైపులా కార్ల పార్కింగ్!



నందిఘాట్ వద్ద రోడ్డుకు రెండువైపులా ప్రమాదకరంగా నిలిపిన కార్లు

వికారాబాద్, జూన్ 29(ఆంధ్రజ్యోతి):ఆహ్లాదకర వాతావరణంలో గడపుదామని వచ్చే పర్యాటకు ప్రాణాలతో అటవీ శాఖ అధికారులు చెలగాటం ఆడుతున్నారు. అనంతగిరి ఘాట్‌రోడ్డులో నందిఘాట్ వద్ద ఉన్న పార్కింగ్ స్థలంలో పనులు జరుగుతుండగా పార్కింగ్‌లోకి కార్లు వెల్లడం లేదు. దీంతో అటవీ శాఖ సిబ్బంది వాహనాలను ఘాట్ రోడ్డుకు ఇరువైపులా పార్క్ చేయిస్తున్నారు. అయితే ఇది ప్రాణాలతో చెలగాటంలా మారింది. గుట్టపై వేగంగా వచ్చే వాహనాలు ఏ మాత్రం కొద్దిగా రోడ్డు కిందికి దిగినా పార్క్ చేసిన వాహనాలను ఢీకొనడం ఖాయం. అసలే ఇరుగ్గా ఉన్న ఈ రోడ్డులో రెండు వైపుల నుంచి వాహనాలొస్తే సైడ్ ఇచ్చేందుకు రోడ్డు కిందికి దిగేందుకు వీలు లేకుండా పార్కింగ్ వాహనాలతో ఇబ్బంది ఏర్పడుతోంది. సెలువు రోజుల్లో అనంతగిరికి వేలాదిగా పర్యాటకులు వస్తున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు రోడ్డు పక్కన పెడుతున్న వాహనాలను గుట్ట కింద లేదా లేదా పార్కింగ్ స్థలంలో పనులు త్వరగా పూర్తిచేసి రోడ్డు పక్కన పార్కింగ్ లేకుండా చూడాలని పర్యాటకులు కోరుతున్నారు.



పార్క్ చేసిన కార్లతో ఇరుగ్గా మారిన రోడ్డు



రెండు రూట్ల నుంచి వచ్చిన వాహనాలతో స్తంభించిన ట్రాఫిక్

అనధికారికంగా లబ్ధిదారుల గృహ ప్రవేశాలు



పూజలతో గృహ ప్రవేశాలు చేస్తున్న లబ్ధిదారులు

మంచాల, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధి లింగంపల్లి గేటు వద్ద నిర్మించి డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి లబ్ధిదారులు ఆదివారం అనధికారికంగా గృహ ప్రవేశాలు చేశారు. లింగంపల్లి గేటు వద్ద గల స్థలంలో ప్రభుత్వం మూడు వరుసల్లో (1+2) అంతస్థుల చొప్పున 98డబుల్ బెడ్‌రూం యూనిట్లను నిర్మించింది. లింగంపల్లి, నోముల, మంచాలకు చెందిన లబ్ధిదారులు, రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డ చెన్నారెడ్డి గూడకు చెందిన వారి ఐదు కుటుంబాలతో కలిపి మొత్తం 96 మందికి ప్రభుత్వం ఇళ్లను కేటాయించింది. నిర్మాణాలు పూర్తయి ఆరేళ్లయినా లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేయలేదు. దీంతో లబ్ధిదా రులు పలుమార్లు ఆందోళనలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏడాదిన్నరగా ఇళ్ల పంపిణీపై చర్యలు తీసుకోలేదు. దీంతో ఇటీవల లబ్ధిదారులు మూడుసార్లు ఇళ్ల సముదాయాల వద్ద ఆందోళనలు చేశారు. ఎ మ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పందిస్తూ డబుల్ బెడ్ రూం ఇళ్లలో విద్యుత్, నీరు, డ్రైనేజీ వసతులు పూర్తిచేసి 15రోజుల్లో పంపిణీ చేస్తామని రెండు రోజుల క్రితం మండల పర్యటన సందర్భంగా హామీ ఇచ్చారు. అయినా మాట వినని లబ్ధిదారులు ఆదివారం అనధికారికంగా గృహప్రవేశాలు చేశారు. ఆర్ఐ రమేష్ లబ్ధిదారులతో మాట్లాడుతూ.. మిగిలి ఉన్న పనులు త్వరలో పూర్తి చేస్తామని, అప్పుడే అధికారి కంగా గృహ ప్రవేశాలు చేయాలని ఒప్పించే ప్రయత్నం చేసినా వారు ఆయన మాట వినలేదు. తాము ఉదయం ఇళ్లలో ఉండి వంటావార్పు చేసుకుని, సాయంత్రానికి తిరిగి వెళ్తామని తెగేసి చెప్పా రు. ఇప్పటికైనా మిగిలి ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులు, నేతలను పేదలు కోరారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్ఐ రమేష్

టూర్ ప్యాకేజీకి విశేష స్పందన : ఆర్టీసీ డీఎం



ఆర్టీసీ బస్సులో తీర్థయాత్రకు బయల్దేరుతున్న భక్తులు

వికారాబాద్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఆలయాల సందర్శనకు ఆర్టీసీ ప్రవేశపెట్టిన టూర్ ప్యాకేజీకి స్కీంకు ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభిస్తోందని వికారాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ అరుణ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. ప్యాకేజీలో భాగంగా 64 మంది ప్రయాణికులు ఈ నెల 27న ధర్మపురి ఆలయ దర్శనానికి బయలుదేరారని తెలిపారు. 27న వికారాబాద్ హైదరాబాద్, వేములవాడ, కొండగట్టు, ధర్మపురి ఆలయల దర్శనానికి ప్యాకేజీలతో రెండు బస్సులను నడిపామన్నారు. దీంతో ప్రయాణికులు సంతోషించారని, ఇంకా వేర్వేరు రూట్‌లలో ప్యాకేజీలతో బస్సులు నడపాలని కోరారని వివరించారు.అరుణాచలం, మంత్రాలయం, భద్రాచలం రూట్లలో ప్యాకేజీలతో బస్సులు నడుపుతున్నామని, వికారాబాద్ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఒక్కో ట్రిప్పులో కనీసం 30 నుంచి 40మంది ప్రయాణికులు బుక్ చేసుకుంటే నేరుగా వారి కాలనీ వద్దకే బస్సును పంపుతామని డీఎం వెల్లడించారు. మరిన్ని వివరాలకు ప్రజలు, భక్తులు 9959226252, 9441224543, 9704039427 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మృతురాలి కుటుంబానికి నాయకుడి పరామర్శ

కడ్తాల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గట్టిప్పలపల్లి గ్రామానికి చెందిన పల్లె సుశీలమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం మృతురాలి కుటుంబ సభ్యులను తలకొండపల్లి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. మృతురాలి బంధువులకు ధైర్యం చెప్పారు. తన వంతుగా బాధిత కుటుంబానికి రూ.3వేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు ఏదుల రాజు, జంగయ్య, కృష్ణయ్య, విజేందర్, వెంకటేశ్, ప్రవీణ్, అభి, తదితరులు ఉన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

అందరికీ ఆదర్శం.. హెలెన్ కెల్లర్

ఆమనగల్లు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రపంచ స్థాయిలో పేరొంది మరెందరికో స్పూర్తిగా నిలిచిన హెలెన్ కెల్లర్ అందరికీ ఆదర్శమని ఆమనగల్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి గంప శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ గవర్నర్ మహేంద్రకుమారెడ్డి సూచనల మేరకు జూలై 1 నుంచి 8వ తేదీ వరకు కెల్లర్ వారోత్సవాలు క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలను వారు వివరించారు. నేత్రవైద్య శిబిరం, ఐఓఎల్ ఆపరేషన్లు, మధుమేహ వ్యాధి నిర్ధారణ శిబిరాలు, విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ, రక్తదాన శిబిరాలు, పలువురు డాక్టర్లకు సన్మాన కార్యక్రమాలు చేపడుతామని గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.



మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి









గోప్యనాయక్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న హరీశ్‌రావు, నాయకులు

రాంబల్‌కు హరీశ్‌రావు పరామర్శ

కేశంపేట, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు రాంబల్‌నాయక్‌ను ఆదివారం సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు పరామర్శించారు. రాంబల్ తండ్రి గోప్యనాయక్ ఇటీవల మృతిచెందారు. ఆదివారం సంస్మరణ సభ నిర్వహించారు. హరీశ్‌రావు, మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, జైపాల్‌యాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, రవీందర్‌యాదవ్‌లు గోప్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. రాంబల్, ఆయన తల్లి సీతమ్మ, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మురళీధర్‌రెడ్డి, పల్లె నర్సింగ్‌రావు, నారాయణరెడ్డి, దేవేందర్, శేఖర్, శ్రీశైలంగౌడ్, జగన్మోహన్‌రెడ్డి, సురేశ్, బ్రహ్మచారి, సాజిద్, జమాల్‌ఖాన్, మల్లేష్, ప్రేమ్‌కుమార్‌గౌడ్, భగవత్‌రెడ్డి పాల్గొన్నారు.

తిమ్మాపూర్ వద్ద హరీశ్‌రావుకు ఘన స్వాగతం

కొత్తూర్: రాంబాల్‌నాయక్‌ను పరామర్శించేందుకు కేశంపేట మండలానికి వెళ్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావుకు తిమ్మాపూర్ వద్ద ఎమ్మెల్సీ వీన్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ఘన స్వాగతం పలికారు. హరీశ్‌రావుకు శాలువాలు, పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు. బీఆర్ఎస్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ, సత్తయ్య, పద్మారావు, అజయ్‌మిట్టునాయక్, శివచారి, దినేష్‌సాగర్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

లంబాడాలకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలి

కేశంపేట, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి వర్గంలో లంబాడా సామాజిక వర్గానికి స్థానం కల్పించాలని లంబాడా హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విస్లావత్ చందర్‌నాయక్ డిమాండ్ చేశారు. ఎక్లాస్‌ఖాన్‌పేట పంచాయతీ పొడగుట్టతండాలో ఆదివారం నంగారభేరి కరపత్రాన్ని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎల్‌హెచ్‌పీఎస్‌ను స్థాపించి 28ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జూలై 1న తండాల్లో నంగార జెండాలను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. ఎల్‌హెచ్‌పీఎస్ పోరాటాలతోనే తండాలను ప్రభుత్వం పంచాయతీలుగా ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. లంబాడాల గోర్బోలి భాషను కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. గిరిజన నిరుద్యోగులకు గత ప్రభుత్వం మంజూరు చేసిన ప్రొసిడింగ్, చెక్కులు ఇచ్చిన 30వేల మందికి వెంటనే నిధుల విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో మోహన్‌నాయక్, గోపాల్, బాబురాజ్, అయోధ్య శ్రీనివాస్, సంతోష్, పరశురామ్, రవి, రాజేష్ నాయక్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

చేవెళ్ల, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని ఏఐటీయూసీ రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు రామస్వామి అన్నారు. ఆదివారం చేవెళ్లలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రతీ కార్మికుడికి నెలకు కనీస వేతనం రూ.26వేలివ్వాలని, జూలై 9న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కార్మికులు సాధించుకున్న 44 రకాల చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మిక వర్గానికి అన్యాయం చేశారని అన్నారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీలతో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతబడి కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. దేశవ్యాప్త సమ్మెలో అన్ని కార్మిక సంఘాలు పాల్గొన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, మక్బూల్, మంజుల, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాయిచంద్ సేవలు చిరస్మరణీయం

కడ్తాల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలి దశ ఉద్యమంలో తెలంగాణ ఉద్యమకారుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ దివంగత సాయిచంద్ మౌర్య సేవలు మరువలేనివని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ అన్నారు. ఆదివారం కడ్తాలలోని కూడలిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సాయిచంద్ వర్థంతి వేడుకను నిర్వహించారు. సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేశ్, మాజీ జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ పాల్గొని నాయకులతో కలిసి సాయిచంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. పరమేశ్ మాట్లాడుతూ.. తన ఆట, పాటలతో ఉద్యమంలో, తెలంగాణ పునర్నిర్మాణంలో సాయిచంద్ విశేషమైన కృషి చేశారన్నారు. తెలంగాణ చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. సాయిచంద్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జోగు వీరయ్య, గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, రామునాయక్, ఆనంద్, తులసీరామ్‌నాయక్, యాదయ్య, మహేశ్, అంజి, శ్రీను, రమేశ్, రామచంద్రయ్య, శ్రీకాంత్, సురేశ్, ప్రశాంత్, రాములు, తదితరులు పాల్గొన్నారు.



రేషన్ కార్డులను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పేదలకు అండగా ప్రజా ప్రభుత్వం

కడ్తాల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు అండగా ఉందని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్, మండల అధ్యక్షుడు బోసు రవి అన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కడ్తాలలో నూతనంగా మంజూరైన రేషన్‌కార్డులను రాజేశ్, రవి లబ్ధిదారులకు అందజేశారు. వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేద వాడికీ రేషన్ కార్డు ఇస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రేషన్‌కార్డులు రాని వారు మీసేవల్లో అప్లై చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆకాశ్‌గౌడ్, భానుకిరణ్, కృష్ణ శ్రీను, రామకృష్ణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

యాచారం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): యువత గంజాయి డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాలు తీసుకొని జీవితాలను పాడు చేసుకోవద్దని సీఐలు లిక్కి కృష్ణంరాజు, జోసఫ్‌లు అన్నారు. ఆదివారం రాత్రి కుర్మిద్దలో గంజాయి, డ్రగ్స్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సీఐలు మాట్లాడుతూ.. యువకులు మద్యానికి బానిసగా మారడమంటే మీ కుటుంబాలకు మీరే దూరమవుతున్నట్టు గమనించాలన్నారు. తల్లిదండ్రులు ఎంతో శ్రమపడి చదివిస్తున్నారని, వారి శ్రమకు తగ్గ ఫలితం ఇవ్వడం పిల్లలుగా మీ బాధ్యత అని గుర్తు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు మీకు ఫోన్ చేస్తే అడిగితే ఆధార్, బ్యాంక్ ఖాతా నంబర్లు, ఓటీపీలు చెప్పొద్దని గ్రామస్తులకు సూచించారు. బైక్, స్కూటీలు అతి వేగంగా నడిపి ప్రమాదాలకు గురికావొద్దన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కోసం పోలీసులు పలు వీడియోలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్సై అజయ్‌భార్గవ్, ఏఎస్సై సోమనాథ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ కృష్ణంరాజు

వర్షాకాలం.. వ్యాధుల భయం



సీజనల్ రోగాలతో అప్రమత్తత అవసరం



పరిగి-షాద్‌నగర్ రోడ్డులో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

- కలుషిత నీరు, అపరిశుభ్ర ఆహారం తీసుకోవద్దు
- పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి
- అప్రమత్తతోనే సంపూర్ణ ఆరోగ్యం
- వ్యాధి సోకితే రోగులు వెంటనే చికిత్స పొందాలి

పరిగి/కొడంగల్ రూరల్/దౌల్తాబాద్/దుద్యాల, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఎండ కాలం ముగిసింది. వర్షాకాలం వచ్చింది. వానలు భారీగా కురియకున్నా అడపాదడప కురిసే వర్షాలతో వచ్చే కొత్త నీరు, లోపించే పారిశుధ్యంతో వివిధ రకాల వ్యాధులు వస్తాయి. వైరల్ జ్వరాలు, మలేరియా, డయేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలుతాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

వైరల్ ఫీవర్

వైరల్ జ్వరాన్ని సీజనల్ ఫీవర్ అని కూడా అంటారు. వాతావరణ మార్పులతో వైరల్ ఫీవర్ వస్తుంది. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు దీని బారిన పడుతారు. జలుబు, దగ్గు, తరచూ తుమ్ములు, తలనొప్పి రావడం వైరల్ ఫీవర్ లక్షణాలు. డెంగ్యూ దోమకాటు వల్ల వస్తుంది. కీళ్ల నొప్పులు, ప్లేట్‌లెట్స్ పడిపోవడం, బలహీనత వంటి ఈ వ్యాధి లక్షణాలు.

అతిసార(డయేరియా)

కలుషిత నీరు, కలుషితాహారం కారణంగా అతిసార వస్తుంది. హోటళ్లలో, టీకొట్టుల వద్ద, ఇళ్లలో అపరిశుభ్ర నీరు తాగడం, నిల్వ ఉంచిన, నాణ్యత లేని, కీటకాలు వాలిన ఆహారం తినడం వంటివి అతిసార(డయేరియా)కు కారణం. 'ఇ-కోలై' బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించడం వల్ల వ్యాధి వస్తుంది. నిల్వ ఉన్న, మురిగిన ఆహారం, రోడ్లపైన అమ్మే పదార్థాలు, స్వీట్లు, మురిగిన పండ్లు తిన్నా ఈ వ్యాధి సోకుతుందని వైద్యులు చెబుతున్నారు. రోగనిరోధకత తక్కువగా ఉండే పిల్లలు, వృద్ధులు, మహిళలకు ఈ వ్యాధి ఎక్కువ వస్తుంది.

వ్యాధి లక్షణాలు ...

నీళ్ల విరేచనాలు, వాంతులు, కడుపునొప్పి అతిసార ప్రధాన లక్షణాలు. రోజుకు మూడు.. అంతకంటే ఎక్కువసార్లు విరేచనాలైతే అతిసారగా నిర్ధారిస్తారు. ఇది బాక్టీరియా వల్లగానీ, వైరస్ వల్లగానీ వస్తుంది. వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి, దాహం, నోరెండిపోవడం వంటి లక్షణాలుంటాయి. జీర్ణాశయం, పేగుల ఇన్ఫెక్షన్‌తో వ్యాధి తీవ్రత పెరుగుతుంది. వాంతులు, విరేచనాలతో రోగి శరీరంలోని లవణాలను కోల్పోతాడు. వ్యాధి సోకిన వ్యక్తికి విపరీతంగా దాహం వేస్తుంది. గొంతు, నాలుక తడారుతాయి. కళ్లు మూసుకుపోవడం, చర్మం పొడిబారడం వంటి లక్షణాలుంటాయి. మూత్ర విసర్జన తగ్గుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మందులు వాడినా కొన్ని జాగ్రత్త తీసుకోవాలి. అతిసార సోకిన వారికి ఎక్కువగా ద్రవపదార్థాలివ్వాలి. ఓఆర్ఎస్ పౌడర్‌ను నీటిలో కలిపి తాగించాలి. గ్లూకోజ్ వాటర్, ఉప్పు, నిమ్మరం కలిపిన ద్రావకం, కొబ్బరినీళ్లు, మజ్జిగ, పాలు, బార్లీ వంటి వాటిల్లో ఏదో ఒకటి తరచూ ఇస్తుండాలి. గంటకు రెండు లీటర్ల ద్రవపదార్థాన్ని రోగికి అందించాలి. ఇలా చేస్తే బ్యాక్టీరియా నశిస్తుంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. వేడి ఆహారమే తినాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.



టైఫాయిడ్.. లక్షణాలు

తీవ్ర జ్వరం, విరేచనాలతో శరీరంలో ఉండే నీటి శాతం తగ్గి డీహైడ్రేట్ అవుతారు. దీనిని టైఫాయిడ్ లక్షణాలుగా గుర్తించాలి. ఆలస్యం చేయకుండా వైద్య చికిత్స చేయించుకోవాలి. క్యూలెక్స్ దోమ వలన ఫైలేరియా(బోధకాలు) వస్తుంది. జపనీస్ ఎన్‌సెఫెలైటీస్ అనే వైరస్ సోకితే ఇది వ్యాప్తి చెందుతుంది. దీని వలన మెదడు వాపు సైతం వస్తుంది. దోమలు కుట్టకుండా జాగ్రత్తపడాలి.

దోమకాటుతో మలేరియా ...

మలేరియా ప్లాస్మోడియం అనే పరాన్నజీవి సంక్రమించిన ఆడ ఎనాఫిలిస్ దోమ కాటు ద్వారా వస్తుంది. దోమలు నీటనిల్వల్లో పెరిగి మలేరియాను వ్యాప్తి చేస్తాయి. ఈ దోమలు కుట్టడం ద్వారా ఏడు నుంచి పది రోజుల్లోపు ఒంటి నొప్పులతో కూడిన జ్వరం రోజు విడిచి రోజువస్తుంది. వ్యాధి లక్షణాలు కన్పించిన వెంటనే వైద్యుడితో చికిత్స చేయించుకోవాలి.

డెంగీతో తీవ్ర జ్వరం

దోమ కాటు ద్వారా ఆకస్మిక జ్వరం, నొప్పులు వస్తే అది డెంగీ కావచ్చు. ఇది ఆడ ఈడిస్ దోమ కాటుద్వారా వస్తుంది. ఈ దోమలు ఎక్కువగా పగటిపూట కుడతాయి. దోమకాటుతో మూడు నుంచి 14 రోజుల్లో డెంగీ వస్తుంది. తీవ్ర జ్వరం, కీళ్లు, కండరాల నొప్పులు, వాంతులు అవుతాయి. కొందరికి శరీరంపై దద్దులు, చిగుళ్ల నుంచి రక్తం కారుతుంది. అత్యవసర చికిత్స తీసుకోవాలి. కొందరికి ప్లేట్‌లెట్స్ ఎక్కించాల్సి వస్తుంది. గర్భిణులు, పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి ప్రమాదం ఎక్కువ. వెంటనే చికిత్స చేయించుకోవాలి.

పచ్చ కామెర్లు

కాలేయ వాపు, కళ్లు పసుపుపచ్చగా మారడం, ఆకలి మందగించడం వంటి వాటిని పచ్చకామెర్ల వ్యాధిగా నిర్ధారిస్తారు. ఈ వ్యాధి సోకిన వారు ఆహార నియమాలు తప్పక పాటించాలి. వెంటనే వైద్య చికిత్స చేయించుకోవాలి. ఆలస్యం చేస్తే ప్రాణహాని ఉంటుంది.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు



సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ను ఏర్పాటు చేశాం. 24గంటలు అందుబాటులో ఉండే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశాం. ఈ మూడు నెలలు ప్రతి ఆశా కార్యకర్త రోజుకు 50 ఇళ్లు తిరిగి ఫీవర్ సర్వే చేస్తారు. రోగాలు ప్రబలే ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తాం. ప్రజారోగ్యంపై ఎంపీడీవో, తహసీల్దార్లు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది.

- రవీందర్‌యాదవ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో

పరిశుభ్రత పాటించాలి



సీజన్‌తో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వైరస్, బ్యాక్టీరియాల వలన వ్యాధులొస్తాయి. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటినే తాగాలి. వేడిగా ఉన్నప్పుడే ఆహారం తినాలి. నిల్వ ఆహారాన్ని ఏ కాలంలోనూ తినొద్దు. వంటపాత్రలపై మూతలు పెట్టుకోవాలి. వ్యాధి వచ్చిన వెంటనే చికిత్స చేయించుకోవాలి.

- డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో, వికారాబాద్

పారిశుధ్యంపై దృష్టిపెడుతున్నాం



ప్రజలు ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. మేం నిరంతరం పారిశుధ్య చర్యలు చేపడుతున్నాం. దోమల నివారణకు అన్ని కాలనీల్లో మందును పిచికారి చేయిస్తున్నాం. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

- వెంకటయ్య, మునిసిపల్ కమిషనర్, పరిగి

వికారాబాద్‌కు ఔటర్ రింగ్ రోడ్డు వేయాలి

- వీడీడీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్



వీడీడీఎఫ్ సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

వికారాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మన్నెగూడ వరకు ఏర్పాటవుతున్న రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్)కు కనెక్ట్ చేస్తూ వికారాబాద్‌కు ఔటర్ రింగ్ రోడ్డు వేయాలని వీడీడీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం వికారాబాద్‌లో వీడీడీఎఫ్ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వికారాబాద్ జిల్లా సమగ్ర అభివృద్ధికి అంశాల వారీగా సమస్యలను ప్రతినిధులు, అధికారులకు నివేదించి పరిష్కారానికి కృషి చేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రమాదాలు జరుగుతున్న పోలీస్ అకాడమీ నుంచి మన్నెగూడ జతీయ రహదారి(ఎన్‌హెచ్ 163) పనులను తక్షణమే చేపట్టాలన్నారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు వెంకటరత్నం, శ్రీశైలం మాట్లాడుతూ.. జిల్ల ప్రజల చిరకాల కోరిక గ్రామీణ విశ్వ విద్యాలయం వికారాబాద్‌లో ఏర్పాటు చేయాలని, జిల్లాలో కేంద్రియ విద్యాలయం, నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. అనంతగిరిని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు అశోక్, ఆనంద్ గౌడ్ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను చేపట్టి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఫోరం ప్రతినిధులు దేవదాసు, మాణిక్ రెడ్డి, మారుతి, పక్రుద్దీన్ మాట్లాడుతూ.. అనంతగిరి, రామయ్యగూడ, గంగారం మార్గాల్లో రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని కోరారు. వికారాబాద్ - కృష్ణ రైల్వే మార్గాన్ని చేపట్టాలని, జిల్లాలో యువత కోసం నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలని పరిగి నియోజకవర్గ ప్రతినిధి నాగేశ్, రాములు కోరారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్, తెలంగాణ లెక్చరర్ ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతిరెడ్డి, మహేష్, ప్రైవేటు విద్యాసంస్థల ప్రతినిధులు సుధాకర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, విజయ్‌కుమార్, ఆకుల నందకుమార్, గీత, షఫీ, రామచందర్, పులుమద్ది శ్రీను, శాంత్‌కుమార్, అనంతయ్య, జగన్నాథం పాల్గొన్నారు.

ప్రతీ తండాకు శుద్ధమైన తాగునీరు

ఆమనగల్లు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రతీ తండాకు ప్యూరిఫైడ్ తాగునీటిని అందించాలన్నదే ఐక్యత ఫౌండేషన్ ధ్యేయం అని ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ ఎర్రబిక్య తండాలో ఆదివారం ఆయన పర్యటించారు. హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు తండాలో రూ.1.5లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫయింగ్ సెంటర్‌ను సుంకిరెడ్డి ప్రారంభించారు. తండా వాసులు రాఘవేందర్‌రెడ్డిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఫౌండేషన్ ద్వారా పాటుపడుతున్నట్టు తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధికి కృషిచేస్తున్నట్టు చెప్పారు. అంధత్వ నివారణ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా ముందుకు తీసుకుపోవాలన్న లక్ష్యంతో జూలై 4 నుంచి 13 వరకు మెగా వైద్య శిబిరాలను నిర్వహించి వైద్య సేవలందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు మండ్లి రాములు, నాయకులు బొబ్బిలి, రాజశేఖర్, కృష్ణ, బిచ్యా, మోత్య, నక్రు, హన్మంత్, నంగ్ర్య, గంగ్య, హర్య, రాములు, శ్రీను, రమేశ్, పండు, భాస్కర్, సికిందర్, లాలూ, శివ, కుమార్, చిన్న, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

కడ్తాల్: ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలుపంచుకోవాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. కానుగు బావితండాలో నిర్మిస్తున్న తుల్జాభవానీ ఆలయానికి ఫౌండేషన్ ద్వారా రూ.లక్ష చెక్కును ఆయన అందజేశారు. సుంకిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి బిక్య, పాండు నాయక్, బిచ్యా, నర్సింగ్, దేవు, ఫౌండేషన్ సభ్యులు టి.రఘు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సంరక్షణకు ప్రభుత్వం పెద్దపీట

తలకొండపల్లి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆమనగల్లు మార్కెట్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతులు కల్పించి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. తలకొండపల్లి మండలం అంతారానికి చెందిన సమీన్‌బేగం అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. చికిత్సకు ఆర్థిక సాయమందించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.5లక్షల ఎల్వోసీ చెక్కును మంజూరు చేయించారు. ఆదివారం వెంకట్‌రెడ్డి సమీన్ తండ్రి ఆరిఫ్‌కు ఎల్వోసీ అందజేశారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదల ఆరోగ్య పరిరక్షణ రూ.10లక్షల వరకు వైద్య ఖర్చులను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో మండల అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, అజీజ్, అశోక్‌బాబు, రవీందర్‌గౌడ్, మహేశ్, మల్లేశ్, జాఫర్, లక్ష్మణ్, గౌస్, విష్ణు, శివ పాల్గొన్నారు.

మేడిపల్లి కలాన్‌లో అంధకారం

- ఓ వైపు వర్షం.. మరోవైపు చీకటి
- గ్రామంలో అనారోగ్యంతో పది నెలల చిన్నారి మృతి
- చీకట్లోనే మృతదేహం వద్ద కుటుంబీకులు
- ఫోన్ చేసినా స్పందించని విద్యుత్ శాఖ అధికారులు



కరెంటు లేక చీకట్లో ఆరుబయటికి వచ్చిన గ్రామస్తులు

ఫరూఖ్‌నగర్... ఫూదూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిపల్లి కలాన్‌లో అంధకారం అలుముకుంది. ఆదివారం గ్రామంలో వర్షం కురిసింది. వర్షానికి తోడు కరెంటు కూడా లేక గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. ఇంట్లో చీకటి, బయట వర్షంతో తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. గంటల తరబడి కరెంటు లేక చిన్నారు, వృద్ధులు ఇబ్బంది పడ్డారు. గ్రామంలో ప్రవీణ్-మానస దంపతుల పది నెలల చిన్నారి అనారోగ్యంతో మృతిచెందింది. గ్రామస్తులు బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లాలన్నా గ్రామంలో అంధకారం నెలకొంది. వర్షం తగ్గిన తర్వాత కొందరు విద్యుత్ అధికారులకు, లైన్‌మన్‌కు ఫోన్ చేసినా స్పందించలేదని గ్రామస్తులు తెలిపారు. గంటల తరబడి విద్యుత్ కోత విధించి, ఫోన్లు చేసినా స్పందించని విద్యుత్ శాఖ సిబ్బందిపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పరిగి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జూలై 9న నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌రావు, జిల్లా కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. పరిగిలో ఆదివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని ఆరపించారు. స్వాతంత్రానికి పూర్వం పోరాడి సాధించుకున్న చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఇప్పటివరకు 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. పని గంటలను ఎనిమిని నుంచి 12 గంటలకు పెంచిందని విమర్శించారు. దేశవ్యాప్త సమ్మెకు ప్రతి ఒక్కరూ సహకరించి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు స్వరూప, దేవి, అంగమ్మ, బాలమణి, పాండు, వెంకట్రాములు, బాలయ్య, నర్సింహులు, నరేష్ పాల్గొన్నారు.

ఆస్తిపన్ను చెల్లింపునకు నేడే ఆఖరు

- ముగియనున్న రాయితీ చెల్లింపు గడువు

తాండూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి):ఆస్తిపన్ను రెండో అర్థ వార్షిక చెల్లింపునకు ఈ రోజు(30 జూన్) మాత్రమే మిగిలి ఉంది. 30లోగా ఆస్తి పన్ను చెల్లిస్తే ఫైన్ ఉండదు. గడువు దాటిన తర్వాత ఆస్తిపన్ను చెల్లింపునకు నూటికి రూ2 చొప్పున అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. మునిసిపాలిటీల్లో ఏడాదికి రెండు విడతల్లో ఆస్తిపన్ను వసూలు చేస్తారు. మొదటి అర్ధవార్షిక పన్ను ఏప్రిల్-సెప్టెంబరు కాలానికి జూన్ ఆఖరికల్లా చెల్లించాలి. రెండో అర్ధవార్షికం అక్టోబరు-మార్చి నెలల పన్ను ఫిబ్రవరిలో వసూలు చేస్తారు. అయితే చాలా మంది ఇంటి యజమానులు సంవత్సరానికి ఒకే సారి పన్ను చెల్లించాలనే ఆలోచనలో ఉంటారు. అయితే ప్రతి అర్థవార్షిక పన్ను చెల్లిస్తే ఫైన్ పడదు. ప్రస్తుతం రెండో అర్థవార్షిక పన్ను గడువు నేటితో ముగియనుంది. అయితే తాండూరులో ఆస్తిపన్నుపై సిబ్బంది, అధికారులు సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఇళ్ల యజమాలను ఇప్పటి వరకు చాలా మందికి డిమాండ్ నోటీసులు నోటీసులు ఇవ్వలేదని చెబుతున్నారు. అలాగే ఆస్తిపన్ను వసూళ్లపై మున్సిపాలిటీలో తరచూ అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహించడం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఒకటి రెండు సార్లు మాత్రం స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు తప్పితే పన్నుల వసూళ్లపై నిరంతరం దృష్టిసారించడం లేదని విమర్శలు వస్తున్నాయి.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తప్పనిసరి



- పీహెచ్‌సీ వైద్యురాలు ఎం.దీప్తి

ఫటాఫట్

కొత్తూర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు దీప్తి అన్నారు. దోమలు, ఈగల ద్వారా వచ్చే వ్యాధులు, మలేరియా, డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి 'ఆంధ్రజ్యోతి' ఫటాఫట్‌లో ప్రజలకు పలు సూచనలు చేశారు.

ప్రశ్న: వర్షాకాలంలో ఎక్కువగా ఏ వ్యాధులు వస్తాయి?

జవాబు : వర్ష కాలంలో మలేరియా, డెంగీ వ్యాధులు అధికంగా ప్రబలుతాయి. డెంగీ ప్రాణాంతకం. చికెన్‌గన్యా కూడా వచ్చే అవకాశం ఉంది.

ప్రశ్న: వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు : సీజనల్ వ్యాధులు సోకకుండా వానాకాలంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి పరిసరాలల్లో చెత్తాచెదారం చేరకుండా చూసుకోవాలి. నీరు నిల్వ ఉన్న చోట దోమలు, ఈగలు వ్యాప్తి చెంది వ్యాధులు సంక్రమించే అవకాశముంది. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నిల్వ నీటిని ఎప్పటికప్పుడు తీసివేయాలి. దోమ కాటు నుంచి జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రశ్న: సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారా?

జవాబు : వారంలో ప్రతి శుక్రవారం గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటిస్తున్నారు. డ్రైడే, ఫ్రై డే ద్వారా వ్యాధుల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: కొత్తూరు పీహెచ్‌సీలో సరిపోను సిబ్బంది ఉన్నారా?

జవాబు : ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో సిబ్బంది ఉన్నారు. రౌండ్ దా క్లాక్‌గా ఉన్న కొత్తూర్ పీహెచ్‌సీలో కాన్పులు, ఆపరేషన్లు చేసేందుకు కృషి చేస్తున్నాం. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

భర్తీ ఎప్పుడో..?

(ఐదో పేజీ తరువాయి)

కింద 1,600 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 1,577 మంది అంగన్‌వాడీ టీచర్లు పని చేస్తున్నారు. 25 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే 1,380 అంగన్‌వాడీ ఆయా పోస్టులు మంజూరు కాగా.. ప్రస్తుతం 1,274 మంది పనిచేస్తున్నారు. ఇంకా 106 పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.



పిల్లవాడి బరువును కొలుస్తున్న టీచర్ (ఫైల్)

ప్రాజెక్టుల వారీగా ఇలా..

అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు సంబంధించి ప్రాజెక్టుల వారీగా పరిశీలించగా.. ఆమనగల్ ఐసీడీఎస్ ప్రాజెక్టులో 232 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు మంజూరు ఉండగా 227 మంది పనిచేస్తున్నారు. ఐదు ఖాళీలున్నాయి. చేవెళ్ల ప్రాజెక్టు పరిధిలో 255 టీచర్ పోస్టులు మంజూరు ఉండగా 250 మంది పనిచేస్తున్నారు. ఇక్కడ కూగా ఐదు టీచర్ పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అలాగే హయత్‌నగర్ ప్రాజెక్టు పరిధిలో 181 పోస్టులు మంజూరు ఉండగా 178 మంది పనిచేస్తున్నారు. మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం ప్రాజెక్టులో 162 టీచర్ పోస్టులు మంజూరు ఉండగా 158 మంది పనిచేస్తున్నారు. నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మహేశ్వరం ప్రాజెక్టులో 234 పోస్టులు మంజూరు ఉండగా 232 మంది టీచర్లు పనిచేస్తున్నారు. రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. శేరిలింగంపల్లి ప్రాజెక్టులో 220 పోస్టులు మంజూరు ఉండగా 217 మంది టీచర్లు పనిచేస్తున్నారు. మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. షాద్‌నగర్ ప్రాజెక్టు పరిధిలో 316 టీచర్ పోస్టులు మంజూరు కాగా 313 మంది టీచర్లు పనిచేస్తున్నారు. ఇక్కడ కూడా మూడు టీచర్ పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

అధిక ఖాళీల్లో ఆయా పోస్టులే...

జిల్లాలో అంగన్‌వాడీ టీచర్ పోస్టుల కంటే ఆయా పోస్టులే ఎక్కువగా ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఆమనగల్లులో 160 పోస్టులు మంజూరు కాగా 151 మంది ఆయాలు పని చేస్తున్నారు. 9 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చేవెళ్ల ప్రాజెక్టులో 216 పోస్టులు మంజూరు కాగా 196 మంది పనిచేస్తున్నారు. 20 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. హయత్‌నగర్ ప్రాజెక్టులో 177 పోస్టులు మంజూరు కాగా 166 మంది పనిచేస్తున్నారు. 11 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇబ్రహీంపట్నంలో 144 పోస్టులకు గాను 135 పోస్టులు భర్తీ చేశారు. ఇంకా 9 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మహేశ్వరంలో 209 పోస్టులకు గాను 187 మంది పనిచేస్తున్నారు. ఇక్కడ అత్యధికంగా 22 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. శేరిలింగంపల్లిలో 212 పోస్టులకుగాను 193 మంది ఆయాలు పనిచేస్తున్నారు. 19 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. షాద్‌నగర్‌లో 265 ఆయా పోస్టులు మంజూరు కాగా 245 మంది పనిచేస్తున్నారు. ఇంకా 17 మంది ఆయా పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

పెరుగుతున్న పనిభారం..

అంగన్‌వాడీ టీచర్‌కు నెలకు 13,650, ఆయాకు 7,800 రూపాయల గౌరవ వేతనంగా అందజేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని కేంద్రాల వారికి ఈ వేతనాలు కొంత మేరకు ఊరట నిచ్చే విధంగానే ఉన్నప్పటికీ, పట్టణ ప్రాంతాల్లో ఇవి ఏమాత్రం సరిపోవడం లేదంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టులు భర్తీ చేయకపోవడంతో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదు. కేంద్రాల ద్వారా ప్రతీ రోజు పాలు, ఉడుకబెట్టిన కోడిగుడ్లతో పాటు ఆకుకూరలు, ఇతర కూరలతో పౌష్టికాహారం అందిస్తున్నారు. కేంద్రాల్లో రెగ్యులర్‌గా టీచర్లు ఉంటేనే అందరికీ పౌష్టికాహారం సక్రమంగా అందుతుంది. అలాగే ఆరోగ్య సర్వేలు, ఇతర సర్వేల బాధ్యతలను ఎక్కువగా టీచర్లకే అప్పగిస్తుంటారు. టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్న కేంద్రాల నిర్వహణ బాధ్యతను పక్కన ఉండే కేంద్రాల టీచర్లకు అప్పగించడం వల్ల వారిపై అదనపు పనిభారం పడుతుంది. ఆయా పోస్టులు ఖాళీగా ఉన్న కేంద్రాల్లో టీచర్లే ఆ భారాన్ని మోస్తున్నారు. అక్కడ వాళ్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాళ్లకు సర్వే బాధ్యతలు అప్పగించినప్పుడు కేంద్రాలు త్వరగా మూత పడుతున్నాయి. వంటలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సత్వరమే స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పడిన టీచర్, ఆయా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని మహిళలు కోరుతున్నారు.

పోస్టుల ఖాళీల వివరాలు

ప్రాజెక్టు	టీచర్లు	ఆయాలు
ఆమనగల్లు	05	09
చేవెళ్ల	05	20
హయత్‌నగర్	03	11
ఇబ్రహీంపట్నం	04	09
మహేశ్వరం	02	22
శేరిలింగంపల్లి	03	19
షాద్‌నగర్	03	17
మొత్తం	25	106



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

అధికార పార్టీకి కొమ్ముకాస్తున్న తహసీల్దార్

● మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

షాబాద్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఒక పార్టీ నాయకులకు కొమ్ముకాస్తూ, ఇంకో పార్టీ వారిపై అధికారాన్ని ప్రయోగిస్తూ షాబాద్ తహసీల్దార్ అన్వర్ ఇబ్బందులు పెడుతున్నాడని బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చట్టానికి లోబడి ప్రభుత్వ పథకాలను ప్రజలందరికీ సమానంగా అందేలా చూడాల్సిన అధికారి.. కాంగ్రెస్ నాయకుడిలా పనిచేస్తున్నాడన్నారు. హైతాబాద్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 8లో గల ప్రభుత్వ భూమిలో నిరుపేదలైన కొందరు తమకు అసైన్ చేసిన భూమిలో గత పది, ఇరవై ఏళ్ల నుంచి ఇళ్లు, షెడ్లు నిర్మించుకొని ఉంటున్నారని తెలిపారు. వారు అక్రమ కట్టడాలు కట్టుకున్నారంటూ.. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కూల్చివేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. కంపెనీలకు మట్టిని అమ్ముకుంటున్న మాఫియాకు కొమ్ముకాస్తూ.. పెదవేడు, సోలిపేట గ్రామాల్లోని ప్రభుత్వ భూములను గుల్ల చేశారని ఆరోపించారు. అధికార పార్టీ అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రజలను ఇబ్బందులు పెడితే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. హైతాబాద్ అక్రమ కూల్చివేతలపై, అక్రమంగా మట్టి తరలింపుపై ఉన్నత స్థాయి విచారణకు వెళతామని చెప్పారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు, ఈటల రాజేందర్‌ల దృష్టికి ఈ విషయం తీసుకెళ్తామన్నారు. సమావేశంలో నాయకులు వైభవ్‌రెడ్డి, కిరణ్, రాజేష్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సతీష్ తదితరులు ఉన్నారు.

వైద్యశిబిరం విజయవంతం



గ్రామస్థులకు మందులు అందజేస్తున్న విక్రమ్‌రెడ్డి

ఆమనగల్లు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెన్నంపల్లి గ్రామంలో సంఘ సేవకుడు కల్లు విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నీలాద్రి ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని విక్రమ్‌రెడ్డి ప్రారంభించారు. వైద్యులు సైదులు, సిద్దార్థ్, హిందుల ఆధ్వర్యంలో 250 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు పెద్దపీట వేయాలన్నారు. సేవా కార్యక్రమాల్లో యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పోటీ పడాలన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, రాంరెడ్డి, జితేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లిఖార్జున్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, భాస్కర్, రామలింగం, కొండల్‌రెడ్డి, అల్వాల్‌రెడ్డి, రవికుమార్, శ్రీదర్, విజేందర్, మల్లేశ్, మహేశ్, నరేశ్, రాములు, రవీందర్, శేఖర్ గౌడ్, సురేశ్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కందుకూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకులమైలారం ఉన్నత పాఠశాలలో 1984-85 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం నగర శివారులోని కర్మన్‌ఘాట్‌లోని శుభం కన్వెన్షన్‌లో సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. 40 సంవత్సరాల తరువాత వారంతా ఒకే వేదికపై కలుసుకొని అనుభవాలను పంచుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రస్తుత గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాభ్యాసం కోసం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు తమ హయాంలో ఉండి ఉంటే ఉన్నత విద్యతోపాటు ఉద్యోగావకాశాలు దొరుకేవని వారు పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులు పున్న భిక్షపతి, జేబీ లక్ష్మయ్య, జ్ఞానేశ్వర్, కృష్ణ, రమమేష్, చెన్నయ్యచారి, గోపాల్, పద్మ, అరుణ, విజయలక్ష్మి, వెంకటయ్య, ఉపాధ్యాయులు కేశవులు, సదానందం, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో ఆకులమైలారం ఉన్నత పాఠశాల విద్యార్థులు

కాంగ్రెస్‌తోనే అందరికీ న్యాయం : యాదయ్య



ఎమ్మెల్యే యాదయ్య, మధుసూదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

షాబాద్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే బడుగు, బలహీన వర్గాలకు సమ న్యాయం చేకూరుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం షాబాద్‌లో హైతాబాద్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీకి చెందిన 50మంది నాయకులు ఎమ్మెల్యే యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిల సమక్షంలో షాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీల మేరకు దశలవారీగా నెరవేరుస్తుందన్నారు. రైతులకు రుణమాఫీ, రైతుభరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహలక్ష్మి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. తెలంగాణ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలకు వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్, పీసీసీ సభ్యుడు దర్శన్, మాజీ ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, మా జీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, పార్టీలో చేరినవారు పెద్దజంగని రాఘవేందర్, టిల్లు, మహేష్, రమేష్, కిషన్, లక్ష్మణ్, శ్రీను, సురేష్, హరిప్రసాద్, వినయ్‌కుమార్, నాయకులు చేవెళ్ల స్వామి, సంజీవరెడ్డి, కిషోర్, మాణిక్యం, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

చలాన్లే టార్గెట్.. ట్రాఫిక్ నియంత్రణేది?



పోలీస్ స్టేషన్ ఎదురుగా దుకాణాల ముందు నిలిపిన వాహనాలు

(ఐదో పేజీ తరువాయి)

వచ్చిపోయే వాహనాలను అదేపనిగా ఫొటోలు తీస్తున్నారే తప్పా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరణను పట్టించుకోవడం లేదు. రోడ్డు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చలాన్లు వేయడం మంచిదే అయినా ట్రాఫిక్ సమస్యపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. చౌరస్తా నుంచి రైల్వే స్టేషన్ వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. దశాబ్దాల కింద నిర్మించిన వ్యాపార సముదాయాల కారణంగా ప్రస్తుతం రోడ్లు ఇరుకుగా మారాయి. అంతేకాకుండా ఆక్రమణల వల్ల మరింత ఇబ్బందిగా మారుతోంది. దానికి తోడు దుకాణాల ముందు కార్లు, ద్విచక్ర వాహనాలు యథేచ్ఛగా పార్కింగ్ చేసి గంటల తరబడి కొనుగోళ్లు చేస్తుంటారు. గతంలో పోలీసులు మెయిన్ రోడ్డుపై ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన వారిని అక్కడి నుంచి తొలగించారు. కొంతకాలానికి తిరిగి మళ్లీ యథాస్థితికి చేరుకుంది. ఎక్కడ పడితే అక్కడ దుకాణాలు వెలిశాయి. ఏకంగా పోలీస్ స్టేషన్ ఎదుట, పక్కన కూడ రోడ్డును ఆక్రమించి వాహనాలు నిలుపుతున్నారు. పోలీసుస్టేషన్ పక్కన ఉన్న ఓ దుకాణం ఎదుట రోడ్డును ఆక్రమించి వాహనాలు పార్క్ చేస్తున్నారు. అయినా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

చౌరస్తాకు ఇరువైపులా..

జానంపేట వేంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి అనూష్ పరిశ్రమ వద్దకు నాలుగు లేన్ల రోడ్డుగా విస్తరించారు. రోడ్డు విస్తరించినా ప్రయోజనం లేకుండా పోయింది. హైదరాబాద్, మహబూబ్‌నగర్ వెళ్లే మార్గాల్లో ప్రయాణికులను తీసుకెళ్లే ప్రైవేట్ వాహనాలు రోడ్డుపైనే నిలుపుతున్నారు. దాంతో బాటసారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు సెల్లార్లు పార్కింగ్‌కు కాకుండా అద్దెలకు ఇస్తున్నారు. షాపింగ్ మాల్స్ కూడా పెడుతున్నారు. సెల్లార్ల విషయంలో మున్సిపల్ అధికారులు కూడ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. షాద్‌నగర్ పట్టణ జనాభాతో పాటు సుమారు 15 వేల నుంచి 20 వేల మంది నిత్యం వచ్చి పోతుంటారు. దాంతో ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతోంది.

ప్రమాదకరంగా పరిగి రోడ్డు..

పట్టణంలోని పరిగి రోడ్డు ప్రమాదకరంగా మారింది. రోడ్డుకిరువైపులా ఆక్రమణల వల్ల నిత్యం ట్రాఫిక్‌జామ్ అవుతోంది. పరిగి వైపు నుంచి చౌరస్తాకు వచ్చే దారి యమ డేంజర్‌గా ఉంటుంది. హనుమాన్ దేవాలయం నుంచి చౌరస్తా వరకు ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని భయపడుకుంటూ వెళ్లాల్సి వస్తుంది. పూర్తిగా రోడ్డును ఆక్రమించి వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. అయినా ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. చౌరస్తాలోని సిగ్నల్ వద్ద కూడ ట్రాఫిక్ పోలీసులు రెగ్యులర్‌గా ఉండటం లేదు. కరెంట్ పోయినప్పుడు వాహనదారులు ఇష్టాను సారంగా రాకపోకలు సాగిస్తున్నారు. దాంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అందువల్ల పోలీసులు చలాన్లతో పాటు ట్రాఫిక్ నియంత్రణపై కూడా దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

తగిన చర్యలు తీసుకుంటాం



షాద్‌నగర్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు రూపొంది స్తున్నాం. పరిగి రోడ్డులో సాయంత్రం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. అక్కడ కూడా ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటాం. పట్టణంలో రోడ్డు విస్తరణ జరిగినా సెట్‌బ్యాక్ లేకపోవడంతో వాహనాలు రోడ్డు మీదనే నిలుపుతున్నారు. అలా జరుగకుండా చూస్తాం.

- చంద్రశేఖర్, ట్రాఫిక్ సీఐ, షాద్‌నగర్

చకచకా 'తహసీల్దార్' భవన నిర్మాణ పనులు

గతంలో నిధుల్లేక నిలిచిన వర్క్

ఎమ్మెల్యే మల్‌రెడ్డి చొరవతో నిధుల మంజూరు

రెండు నెలల్లో పూర్తికి చర్యలు : పీఆర్‌డీఈఈ



కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు

ఇబ్రహీంపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల తర్వాత ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయ నూతన భవనం పనులు తిరిగి ప్రారంభమైనాయి. గతంలో నిజాం హయాంలో నిర్మించిన భవనం కావడంలో తహసీల్దార్ కార్యాలయం పూర్తిగా శిథిలమై ప్రమాదకరంగా ఉండడంతో ఆ భవనాన్ని కూల్చి 2022 ఫిబ్రవరి మాసంలో నూతన భవనం పనులు ప్రారంభించారు. డీఎంఎఫ్ నిధులు రూ.1.25 కోట్లతో పనులు చేపట్టగా.. నిధులు ఉన్నంత మేరకు రెండు స్లాబులు పూర్తయి కొంతమేర గోడలు కూడా కట్టారు. ఈ భవనం పూర్తవడానికి మరో రూ.90 లక్షలు అవసరమని అంచనాతో అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించగా ఇటీవలే నిధులు మంజూరైనాయి. దీంతో తిరిగి పనులు ప్రారంభమైనాయి. కాగా తహసీల్దార్ కార్యాలయం తాత్కాలికంగా పక్కనే ఉన్న పంచాయతీరాజ్ అతిథి భవనంలో నడుస్తోంది. ఈ భవనం ఇరుకుగా ఉన్నందున ఫైళ్లు నేలపైనే పెట్టాల్సి వస్తోంది. భూముల రిజిస్ట్రేషన్లు, వివిధ పనుల కోసం వచ్చేవారు ఆరుబయటే నిల్చోవాల్సి వస్తోంది. ఏడాది కాలంలో పూర్తి కావాల్సిన భవనం పనులు ఒక్కసారిగా నిలిచిపోవడంతో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చొరవ తీసుకుని మరో రూ.90 లక్షల డీఎంఎఫ్ నిధులు మంజూరు చేయించారు. పంచాయతీరాజ్ అధికారుల పర్యవేక్షలో భవనం పనులు కొనసాగుతున్నాయి. బిహార్ రాష్ట్రానికి చెందిన మేస్త్రీలు చకచకా పనులు చేస్తున్నారు. మరో రెండు నెలల్లో భవనం పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ శ్రీనివాస్ చెప్పారు.

పనుల పూర్తికి ఎదురుచూస్తున్నాం..



నూతన భవనం పనులు ఎప్పుడు పూర్తవుతాయా అని ఎదురు చూస్తున్నాం. తాత్కాలికంగా పంచాయతీరాజ్ భవనంలో తహసీల్దార్ కార్యాలయాన్ని నడుపుతున్నా.. అది సరిపోవడం లేదు. కార్యాలయానికి వచ్చేవాళ్లు హాల్లోనే వేచి ఉంటుండగా సిబ్బంది హాల్లోనే పని చేయాల్సి వస్తోంది. ఫైళ్లను భద్రపరచాలన్నా గదులు సరిపోవడం లేదు. త్వరితగతిన భవనం పనులు పూర్తిచేసి అప్పగించాలని పంచాయతీరాజ్ అధికారులను కోరాం.

- సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం తహసీల్దారు

దేశాభ్యున్నతికి ప్రధాని మోదీ కృషి

ఆమనగల్లు, జూన్ 29(ఆంధ్రజ్యోతి):దేశాభ్యున్నతికి ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. 11 ఏళ్ల మోదీ పాలనలో దేశం అద్భుత విజయాలు సాధించిందన్నారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం మన్‌కీ బాత్ కార్యక్రమం బీజేపీ నాయకులతో కలిసి వీక్షించారు. ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి బీజేపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు.

చేవెళ్ల : మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని చేవెళ్లలో బీజేపీ నాయకులు వీక్షించారు. దేశంలో బీజేపీ సుపరిపాలన నరేంద్రమోదీతోనే సాధ్యమౌతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మున్నూరు శ్రీకాంత్, జిల్లా కౌన్సిల్ మెంబర్ బొబ్బిలి కుమార్‌గౌడ్, బీజేపీ నాయకులు వైభవ్‌రెడ్డి, శ్రీనివాస్, కరుణాకర్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల : మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు రూ.లక్ష విరాళం



గ్రామస్థులకు విరాళం అందజేస్తున్న బీజేపీ నాయకుడు వైభవ్‌రెడ్డి

చేవెళ్ల, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల మండల పరిధిలోని తంగడిపల్లి గ్రామంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు చేవెళ్ల మాజీ ఎంపీపీ మల్గారి విజయలక్ష్మి రమణారెడ్డి కుమారుడు బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి లక్ష రూపాయల నగదును గ్రామస్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు, తంగడిపల్లి గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మీడియాపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

షాద్‌నగర్ అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఓ న్యూస్ ఛానల్‌పై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని బీజేపీ, జర్నలిస్టు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దాడిని ఖండిస్తూ ఆదివారం షాద్‌నగర్ చౌరస్తాలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మీడియాపై దాడిచేసిన వారిని వదలొద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మీడియాపై జరుగుతున్న దాడులను అరికట్టి పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాలని జర్నలిస్టు సంఘాల నాయకులు ఖాజాపాష, రాఘవేందర్‌గౌడ్‌లు ప్రభుత్వాన్ని కోరారు. టీయూడబ్ల్యూజే(ఐజేయూ)నాయకుడు గుడుపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని ఇచ్చి మీడియాపై జరిగిన దాడిని ఈ సందర్భంగా ఖండించారు. అధికారం ఉన్నప్పుడు, అధికారం పోయినప్పుడు కూడా దాడులు చేస్తున్న బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పినా జ్ఞానోదయం రావడం లేదని బీసీ సేన జిల్లా అధ్యక్షుడు సదర్ శ్రీనివాస్, పసుల ప్రశాంత్, బాసవరలక్ష్మి, కత్తి చంద్రశేఖరప్పలు అన్నారు. దాడులను అరికట్టి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని బీజేపీ నాయకుడు అశోక్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు ఆకాష్‌నాయక్‌లు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.



మీడియాపై జరిగిన దాడికి నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

పత్తి పంట.. కలుపుతీత



చిన్నతూండ్లలో పత్తిచేనులో గుంటక కొడుతున్న రైతులు

యాచారం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు యాచారం మండలంలోని పలు గ్రామాలలో రైతులు పత్తిపంటను అధికంగా సాగు చేశారు. చౌదర్‌పల్లి, మేడిపల్లి, తాటిపర్తి, నానక్‌నగర్, మాల్, మంతన్‌గౌరెల్లి, తమ్మలోనిగూడ తదితర గ్రామాల్లో దాదాపు 3,600 ఎకరాల్లో పత్తిపంట సాగు చేశారు. కాగా, పదిహేను రోజులుగా వర్షాలు కురియలేదు. దాంతో పత్తిపంటలో కలుపు పెరిగింది. రోజుకు రూ. 2వేలు వెచ్చించి కలుపుతీతకు రైతులు సిద్ధమయ్యారు. ఈక్రమంలో కలుపు తీయడానికి గుంటకకు బాగా డిమాండ్ పెరిగింది. రెండు రోజుల ముందే కూలీని మాట్లాడుకొని పనులు చేపించుకుంటున్నారు. వరుణదేవుడు కరుణిస్తేనే పంట చేతికందుతుందని రైతులు చెబుతున్నారు.